


మంగళవారం 21 జూలై 2026 పేజీలు : 8

# మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు ఇవ్వొద్దు




జిల్లా కలెక్టరేట్ ముట్టడి.. డీఈఓ కార్యాలయానికి వినతిపత్రం

విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలంటే కార్మికుల ద్వారానే పథకాన్ని కొనసాగించాలి:

సీఐటీయు నాయకులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్

# నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

సాంకేతిక ఆధారాలతో కేసు చేదించిన మావల పోలీసులు

36 గ్రాముల బంగారం, 25. 5 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం

ప్రజలు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

గతంలో ఏ1 పై 8 , ఏ2 పై మూడు దొంగతనం కేసులు







# సమష్టిగా నిలబడి ఎల్- నినోను ఎదుర్కొందాం

ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి ఇల్లంబర్తి అధికారులను ఆదేశించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు, కంటింజెన్సీ ప్లాన్‌లను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవచ్చని ఆయన పేర్కొన్నారు.

# సింగరేణి కోల్ పెన్షన్‌దారులకు ఎస్‌బీఐ తరహాలో బీమా సౌకర్యాలు కల్పించాలి

## యూనియన్ బ్యాంక్ ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల నిరసన







**మంచిర్యాల, 20, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి కోల్ పెన్షన్‌దారులకు ఎస్‌బీఐలో అమలులో ఉన్న తరహాలోనే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాలు కలిగి ఉన్న పెన్షన్‌దారులకు రూ.50 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్రాంచ్ మేనేజర్ బోగే సాగర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఎస్‌బీఐలో ఖాతాలు కలిగి ఉన్న సింగరేణి కోల్ పెన్షన్‌దారులకు అమలవుతున్న బీమా సౌకర్యాలు యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ముఖ్యంగా 70 సంవత్సరాల లోపు ఖాతాదారులకు ప్రమాద బీమా అమలుకు సంబంధించిన నిబంధనలు, ఒప్పంద పత్రాల విషయంలో పూర్తి స్పష్టత లేకపోవడం వల్ల పెన్షన్‌దారుల్లో అనుమానాలు నెలకొన్నాయని తెలిపారు. యూనియన్ బ్యాంక్‌లో ఖాతాలు కలిగి ఉన్న సింగరేణి కోల్ పెన్షన్‌దారులకు ప్రమాద బీమా, సహజ మరణ బీమా సౌకర్యాలు ఉన్నాయా? ఉంటే వాటి అమలు విధానం ఏమిటి? అనే అంశాలపై బ్యాంకు ఉన్నతాధికారులు పత్రికలు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా పూర్తి వివరాలను వెల్లడించి పెన్షన్‌దారుల సందేహాలను నివృత్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు నస్పూర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ బోగే సాగర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, కోశాధికారి బింగి రాజేశం, కార్యదర్శి ఎన్నం శంకర్, ఆర్గనైజర్ తణుకుల మోహన్, జిల్లా ఏరియా నాయకులు సంగెం రాంచందర్, మేడ రాజలింగు, టీ శ్రీహరి, ఎన్. సదాశివ, ఎండి ఖాదర్, హుస్సేన్, ఇ. రాజనర్సు, రేకుల పర్వతాలు, బి. ఒదయ్య, ఎస్.డి. అబ్బాస్ అలీ, బాజీరెడ్డి సురేష్, అర్వ మల్లయ్య, ఇరుకుల జనార్దన్, పి. లక్ష్మయ్య, కె. పోచయ్య, ఎస్. బాణయ్య, కె. దుర్గ య్యతో పాటు పలువురు సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. నిరసన సందర్భంగా "కల్పించాలి... రూ.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి","కల్పించాలి... సహజ మరణానికి రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి", "వర్ధిల్లాలి... సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# కన్నాల ప్రభుత్వ భూముల కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

**జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం**




**మంచిర్యాల, 20, జూలై (ప్రజాజ్యోతి):**మంచిర్యాల లో సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం లేకపోవడంతో విప్లవ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కన్నాల గ్రామపంచాయతీ శివారులోని ప్రభుత్వ భూములను భూకబ్జాల నుంచి రక్షించి, ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని వారు కోరారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ, కన్నాల గ్రామ శివారులోని సర్వే నంబర్లు 60, 112, 114, 142, 143లో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూమాఫియా, రాజకీయ అండతో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. కొంత పట్టా భూమిని కొనుగోలు చేసి, దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కూడా వెంచర్లలో కలిపి విక్రయిస్తున్నారని తెలిపారు . ఈ ప్రాంతంలోని ఎర్రకుంట చెరువు కూడా కబ్జాకు గురైందని, గతంలో అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత చర్యలు చేపట్టలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు, సర్వేలు జరిగినా ఫలితం కనిపించడం లేదని, చెరువు పునరుద్ధరణ పనులు కూడా ముందుకు సాగడం లేదని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు అవసరమైన నాలా, డీటీసీపీ వంటి అనుమతులు లేకపోయినా, కొంతమంది అధికారులు, స్థానిక సంస్థల సహకారంతో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. గుట్టలను తొలిచి చెరువులో మట్టి నింపుతున్నప్పటికీ సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇటీవల నేమిల గుట్టను తొలిచి వెంచర్ పనులు చేపడుతున్న విషయమై డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించగా తమ పరిధిలో కాదని, మైనింగ్ అండ్ జియాలజీ శాఖను సంప్రదించాలని చెప్పారని తెలిపారు. అనంతరం మైనింగ్ శాఖ అధికారులను కలవగా గుట్టలను తొలిచేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వారు చెప్పినట్లు వివరించారు .ప్రభుత్వ భూములను పరిరక్షించి, భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇంటి స్థలాలు లేని పేదలకు ఆ భూములను కేటాయించాలని జేఏసీ డిమాండ్ చేసింది. గత ఏడాది నుంచి పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే, సంబంధిత శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అక్రమాలను అరికట్టాలని కోరారు .ఈ కార్యక్రమంలో టీ. మణిరాం సింగ్ (టీఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి, అంబాల మహేందర్ (ఎస్‌జేకేఎస్) రాష్ట్ర నాయకుడు, ఎం. పోశమల్లు (ఏఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి, గోగర్ల శంకర్ (టీయూసీఐ) రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భద్రతే లక్ష్యం.. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

– ఎస్ఐ ఉషారాణి





**మంచిర్యాల, 20, జూలై (ప్రజాజ్యోతి):** బాలికల భద్రతే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యమని, యువత డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని మంచిర్యాల షీ టీమ్స్ ఎస్ఐ ఉషారాణి పిలుపునిచ్చారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉషారాణి మాట్లాడుతూ, పాఠశాలల్లో గానీ, బయట గానీ ఎవరైనా బాలికలను వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా లేదా భయాందోళనలకు గురిచేసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చిన్నచిన్న విషయాలకు ఆవేదన చెందకుండా తమ లక్ష్యంపై దృష్టి సారించి చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిలో క్రమశిక్షణ, మంచి విలువలు పెంపొందేలా కృషి చేయాలని కోరారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. డ్రగ్స్ కారణంగా జ్ఞాపకశక్తి తగ్గిపోవడంతో పాటు కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతిని, వ్యక్తి తన ఆలోచనలు, ప్రవర్తనపై నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుందని వివరించారు. అలాంటి పరిస్థితుల్లో తీసుకునే తప్పుడు నిర్ణయాలు నేరాలకు దారితీసే అవకాశం ఉందన్నారు. చెడుస్నేహాలు, తప్పుడు అలవాట్లు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని పేర్కొంటూ, మంచి స్నేహితులను ఎంపిక చేసుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. ఒకసారి డ్రగ్స్ లేదా ఇతర వ్యసనాలకు అలవాటు పడితే వాటి నుంచి బయటపడటం చాలా కష్టమని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, అలాంటి కేసుల్లో అరెస్టయితే బెయిల్ కూడా సులభంగా లభించదని, తద్వారా విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. చదువుకునే వయసులో జైలు జీవితం ఎదురైతే జీవిత లక్ష్యాలను సాధించే అవకాశాలు కోల్పోతారని తెలిపారు . ఎవరైనా డ్రగ్స్ లేదా ఇతర చెడు వ్యసనాలకు ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తే వెంటనే పోలీసులకు లేదా ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని, అలాంటి వ్యక్తులకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సరైన మార్గంలో నడిస్తేనే జీవితంలో విజయాలు సాధించగలమని, ఒకసారి తప్పుదారి పట్టి విలువైన సమయాన్ని కోల్పోతే తిరిగి దానిని పొందడం సాధ్యం కాదని ఎస్ఐ ఉషారాణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశంలో మర్రి ఊడల్లా పాతుకుపోయిన ఆహార కల్తీ మహమ్మారిని నిర్మూలించాలి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకోవాలి

### క్యాట్కో రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ లాల్ చౌరసియా






**మంచిర్యాల, 20, జులై (ప్రజాజ్యోతి):** దేశంలో మర్రి ఊడల్లా పాతుకుపోయిన ఆహార కల్తీ మహమ్మారిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాట్కో) రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ లాల్ చౌరసియా డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కొందరు వ్యాపారులు వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక లాభాల కోసం పాలు మొదలుకొని నూనెలు, మసాలా దినుసులు, స్వీట్లు, పప్పు దినుసులు, ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాల్లో విచ్చలవిడిగా కల్తీకి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ ఆహార పదార్థాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, అనేక ప్రాణాంతక వ్యాధులకు ఇవి కారణమవుతున్నాయని అన్నారు. అలాగే అధిక దిగుబడుల కోసం వ్యవసాయంలో విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పు దినుసుల్లో విషపదార్థాల అవశేషాలు మిగిలిపోతున్నాయని పేర్కొన్నారు. వీటి ప్రభావం మానవాళిపైనే కాకుండా పశు, పక్ష్యాదులపై కూడా తీవ్రంగా పడుతోందని తెలిపారు. దాదాపు 30 సంవత్సరాల క్రితమే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పత్తి చేల్లో పనిచేసే తల్లుల పాలలో రసాయన అవశేషాలు ఉన్నట్లు పలు సంస్థలు నిర్వహించిన అధ్యయనాల్లో వెల్లడైందని గుర్తు చేశారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే చివరకు తల్లిపాలు కూడా కలుషితమయ్యే స్థాయికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో నిషేధించిన రసాయనాలు, పురుగుమందులు మన దేశంలో ఇప్పటికీ విరివిగా వినియోగంలో ఉన్నాయని, జన్యుమార్పిడి విత్తనాలు మరియు వాటి ఉత్పత్తులు, ముఖ్యంగా మొక్కజొన్న వంటి పంటల సాగు, వినియోగం కూడా పెరుగుతోందన్నారు. ప్రభుత్వాలు ఆహార ఉత్పత్తులు, విక్రయాల ప్రోత్సాహానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, ఆహార భద్రత ప్రమాణాల అమలు, నాణ్యత నియంత్రణ, వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. రూపొందించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంలో వైఫల్యం, ఉత్పత్తిదారులు, వ్యాపారులు, అధికారులకు ఆహార భద్రత చట్టాలపై పూర్తి అవగాహన లేకపోవడం, నాణ్యత పరీక్షల కోసం తగిన ప్రయోగశాలలు, సిబ్బంది కొరత వంటి అంశాలు కూడా కల్తీ పెరగడానికి ప్రధాన కారణాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో "వన్ నేషన్--వన్ ఫుడ్ యాక్ట్" తీసుకొచ్చి ప్రతి లక్ష జనాభాకు ఒక ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించాలని నిబంధన తీసుకొచ్చిందని గుర్తు చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో కొద్ది సంవత్సరాల క్రితం వరకు నాలుగు, ఐదు జిల్లాలకు ఒకే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండే పరిస్థితి నెలకొందని, వారికి కూడా నూతన ఆహార భద్రత చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో వినియోగదారుల ఫిర్యాదులకు తగిన స్పందన లభించలేదని తెలిపారు .ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించడం స్వాగతించదగ్గ పరిణామమని తెలిపారు. గతంలో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి కరణణ ఆహార భద్రత రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, అయితే ఆయన త్వరలోనే బదిలీ కావడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న సజ్జనార్ ఆధ్వర్యంలో ఆహార భద్రతపై అవగాహన కల్పిస్తూ, హెచ్-ఫాస్ట్ బృందాల ద్వారా నగరం, నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న కల్తీ దందాలను బట్టబయలు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్న అధికారులను క్యాట్కో తరఫున అభినందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ఇలాంటి ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తే కల్తీని గణనీయంగా నియంత్రించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆహార భద్రతను పరిరక్షించాలంటే రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, వినియోగదారుల సంఘాలు, మీడియా, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి వినియోగదారుడు కల్తీపై అప్రమత్తంగా ఉండి ఫిర్యాదులు చేయాలని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాట్కో) రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ లాల్ చౌరసియా పిలుపునిచ్చారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## గ్రీవెన్స్ దేలో ఫిర్యాదులు స్వీకరించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 20, జులై (ప్రజాజ్యోతి):**ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో " గ్రీవెన్స్ – డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడిన సీపీ, బాధితుల ఫిర్యాదులను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని సీపీ తెలిపారు . పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓర్పుతో పూర్తిగా విని ఫిర్యాదులను నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, వాస్తవాలను నిర్ధారించి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజలకు మరింత భరోసా, విశ్వాసం పెరుగుతుందని సీపీ అన్నారు. ప్రజలు, బాధితులు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా చట్టపరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సీపీ అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అక్రమ కలప తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న అధికారులు

## పైన సెంట్రింగ్ చెక్క-లోపల టేకు కలప







**జన్నారం,జూలై20(ప్రజాజ్యోతి)**జన్నారం డివిజన్ ఇంధనపెల్లి రేంజ్ పరిధిలోని కలమడుగు చెక్పోస్ట్ వద్ద ఎఫ్ఆర్వో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రోజున అక్రమంగా తరలిస్తున్న కలప ను పట్టుకున్నారు.ముందస్తు సమాచారం మేరకు ఇంధనపెల్లి రేంజ్ లోని కలమడుగు చెక్పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో టీఎస్ 19 టి 3770 నంబర్ గల అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ లో పైన సెంట్రింగ్ కర్ర పెట్టి కింద అక్రమంగా టేకుదూలాలు,టేకు ఫర్నీచర్ మరియు టేకు దుంగలను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండగా ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ మరియు సిబ్బంది పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఎఫ్ ఆర్ ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టుకున్న కలప విలువ సుమారు రూపాయలు 50 వేల వరకు ఉంటుందని, అధికారులను చూసి స్మగ్లర్లు అక్రమ కలప రవాణా చేస్తున్న వాహనాన్ని అక్కడే వదిలిపెట్టి పారిపోయారని అన్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న టేకు అటవీ ఉత్పత్తులను మరియు వాహనాన్ని స్వాధీనం చేసుకొని అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. స్మగ్లర్లు జన్నారం మండలంలోని దేవుని గూడా గ్రామానికి చెందినవారు కావచ్చని,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అటవీ సంపదను అక్రమంగా నరికి వేయడం, రవాణా చేయడం వంటి చర్యలపై అటవీశాఖ నిరంతరం కఠిన నిఘా ఉంచిందని, అటవీ నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అటవీ సంపద పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అక్రమ కలప రవాణా గురించి సమాచారం ఉంటే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ కోరారు. ఈ తనిఖీలలో ఎఫ్ఎస్ఓ మధుకర్, బీట్ అధికారులు పోచయ్య, తన్వీర్ మరియు బేస్ క్యాంపు వాచర్లు పాల్గొన్నారు.

# రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకతలో సింగరేణిలోనే ఆర్కే న్యూటెక్ గనికి ప్రత్యేక గుర్తింపు

**దేశంలోనే భూగర్భగనుల్లో నంబర్‌వన్‌గా నిలవడం శ్రీరాంపూర్ ఏరియాకే గర్వకారణం**

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**ఈ ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశిత లక్ష్య సాధనకు రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు కృషి చేయాలి**

**మంచిర్యాల, 20, జూలై (ప్రజాజ్యోతి):** రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకతలో సింగరేణిలోనే ఆర్కే న్యూటెక్ (ఆర్కే ఎన్‌టీ) భూగర్భ గనికి ప్రత్యేక గుర్తింపు ఉందని, వరుసగా రెండు సార్లు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడమే కాకుండా 2024--25 సంవత్సరానికి దేశంలోని అన్ని భూగర్భ గనుల్లో నంబర్‌వన్ స్థానంలో నిలవడం శ్రీరాంపూర్ ఏరియాకే గర్వకారణమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, అధిక ఉత్పాదకత సాధనకు అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి సమీక్షా సమావేశాల కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఆర్కే న్యూటెక్ భూగర్భ గనిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జీఎం మునిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గని అధికారులు, మైనింగ్ స్టాఫ్, సూపర్వైజర్లతో సమావేశమై రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. 2024--25 సంవత్సరానికి ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడమే కాకుండా 99 శాతం మార్కులతో దేశంలోని భూగర్భ గనుల్లో నంబర్‌వన్ స్థానంలో నిలిచిన ఆర్కే న్యూటెక్ గని అధికారులు, ఉద్యోగులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గత మూడు సంవత్సరాలుగా వంద శాతం ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధిస్తూ, అత్యుత్తమ ఓఎంఎస్ నమోదు చేసి శ్రీరాంపూర్ ఏరియాలోనే ఉత్తమ గనిగా ఆర్కే న్యూటెక్ నిలిచిందని కొనియాడారు. ఈ ఏడాది కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి



హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయాలని ఆకాంక్షించారు. అయితే ఇటీవల చోటుచేసుకున్న రెండు తీవ్రమైన ప్రమాదాలు దురదృష్టకరమని అన్నారు. వాటి ప్రభావాన్ని అధిగమిస్తూ రక్షణ ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేసి ఫైవ్ స్టార్ రేటింగ్ లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. చిన్న ప్రమాదం జరిగినా ఉత్పత్తి, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం పడుతుందని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతి ఉద్యోగి రక్షణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జీఎం స్పష్టం చేశారు. గతంలో అత్యుత్తమ ఉత్పత్తి, ఉత్పాదకత చరిత్రను సొంతం చేసుకున్న ఆర్కే న్యూటెక్ గని ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించి మరోసారి దేశంలో ఆదర్శ గనిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, గని మేనేజర్ కూరపాటి శ్రీనివాస్, గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య, పిట్ ఇంజనీర్ మద్దెల కృష్ణ, సేఫ్టీ ఆఫీసర్ కొట్టె రమేష్, సంక్షేమ అధికారి సృజన్ పాల్, అసిస్టెంట్ మేనేజర్లు, అండర్ మేనేజర్లు, మైనింగ్ స్టాఫ్, సూపర్వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సింగరేణి యాజమాన్యం కఠిన నిర్ణయం

**పనివేళల్లో మొబైల్‌తో ఫోటోలు, వీడియోలు, రీల్స్ పూర్తిగా నిషేధం**

**ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు.. భద్రతే లక్ష్యంగా కీలక సర్క్యులర్ జారీ**

**మంచిర్యాల, 20, జూలై (ప్రజాజ్యోతి):** ఉద్యోగుల భద్రత, కార్యాలయ క్రమశిక్షణ, ఉత్పాదకతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ సింగరేణి కొలియరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. పనివేళల్లో మొబైల్ ఫోన్లతో ఫోటోలు తీయడం, వీడియోలు చిత్రీకరించడం, సోషల్ మీడియా రీల్స్ రూపొందించడాన్ని పూర్తిగా నిషేధిస్తూ సోమవారం (20-07-2026) కీలక సర్క్యులర్ ను జారీ చేసింది. హెచ్‌వైడీ/సీడీఎన్/ 2026/151 నంబర్‌తో జారీ చేసిన ఈ సర్క్యులర్‌ను అన్ని ఏరియా జనరల్ మేనేజర్లు, సంబంధిత విభాగాధిపతులకు పంపించింది. విధి నిర్వహణ సమయంలో కొంతమంది ఉద్యోగులు మొబైల్ ఫోన్లతో ఫోటోలు, వీడియోలు తీస్తూ, సోషల్ మీడియాలో రీల్స్ రూపొందిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. గనులు, ప్లాంట్లు, వర్క్‌షాప్‌లు, కార్యాలయాలు, ఇతర పని ప్రదేశాల్లో ఇటువంటి చర్యలు ఉద్యోగులకే కాకుండా తోటి ఉద్యోగుల భద్రతకు కూడా తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తాయని సర్క్యులర్‌లో పేర్కొంది. భద్రతకు భంగం కలిగించడమే కాకుండా, విధి నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్లను అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఉద్యోగులు తమ విధులపై దృష్టి కోల్పోయి, ఉత్పాదకత తగ్గడంతో పాటు కార్యాలయ క్రమశిక్షణ




దెబ్బతింటోందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం ఉద్యోగులకు నాలుగు కీలక ఆదేశాలు జారీ చేసింది. అధికారిక (అనుమతి ఉన్న ప్రత్యేక సందర్భాలు మినహా పనివేళల్లో ఎక్కడా మొబైల్ ఫోన్లతో ఫోటోలు తీయడం, వీడియోలు చిత్రీకరించడం, రీల్స్ రూపొందించడం నిషేధించింది. ఉద్యోగులు తమకు అప్పగించిన విధులను పూర్తి శ్రద్ధతో నిర్వహిస్తూ అన్ని భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది. పర్యవేక్షకులు, నియంత్రణ అధికారులు నిరంతర పర్యవేక్షణ, కౌన్సెలింగ్ ద్వారా ఈ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన ఉద్యోగులపై సంస్థ నిబంధనల ప్రకారం కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అంతేకాకుండా ఈ ఆదేశాలను ప్రతి ఉద్యోగికి చేరేలా భద్రతా సమావేశాలు, నోటీసు బోర్డులు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్ని ఏరియా జనరల్ మేనేజర్లను సింగరేణి యాజమాన్యం ఆదేశించింది. ఈ సర్క్యులర్‌తో ఉద్యోగుల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యాలయాల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ, ఉత్పాదకత పెంపునకు సింగరేణి యాజమాన్యం మరో కీలక అడుగు వేసిందని సంస్థ వర్గాలు భావిస్తున్నాయి .

## పల్లె ప్రగతికి మూలం ప్రధాన రహదారుల నిర్మాణం

**నేటికీ గ్రామపంచాయతీలకు సరైన మట్టి రోడ్ల నిర్మాణం లేకపాయే ఏమైపోయానో ప్రభుత్వ పరిపాలన.?**



**కొమరం భీమ్ జిల్లా ప్రతినిధి ( వాంకిడి ) జూలై 20 ప్రజా జ్యోతి**

కొమరం భీమ్ జిల్లా కేంద్రంలో మారుమూల గిరిజన గ్రామ పంచాయతీలకు నేటికీ సరైన మట్టి రోడ్ల నిర్మాణం లేక గిరిజన ప్రజలు అల్లాడిపోవాల్సిన పరిస్థితి ఏమైపోయినా ప్రభుత్వ పరిపాలన పాలకుల పనితీరు కనిపించకపాయెనా పల్లె ప్రగతి పై సవతి తల్లి ప్రేమ నా ? జిల్లాలో ఆయా గ్రామపంచాయతీలకు సరైన మట్టి రోడ్ల నిర్మాణం లేక నేటికీ ప్రజలు అవస్థలు పడుతున్న వైనం జిల్లాలో రెండు నియోజకవర్గాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలన్నా లక్ష్యంతో ప్రజల వద్దకే పరిపాలన ప్రజా అభివృద్ధి ప్రధాన ఎజెండగా పనిచేయాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె ప్రధాన రహదారుల నిర్మాణానికి వివిధ పథకాలు ప్రవేశ పెడుతున్న జిల్లాలో నీతికి కూడా గిరిజన గ్రామపంచాయతీలకు రోడ్డు లేకపోవడం ఇక్కడి పాలకుల పనితీరు కు నిలువెత్తు నిర్లక్ష్యంగా కనిపిస్తున్న దృశ్యాలు ప్రజాసేవలో పాలకులుగా తక్షణమే గిరిజన గ్రామాలకు నాణ్యమైన రోడ్డు నిర్మాణాలను చేపట్టి పల్లె ప్రగతిలో భాగ్య స్వాములు కావలసిన అవసరం ఎంతైనా ఉందంటున్న స్థానికులు ప్రభుత్వం ప్రతి పల్లెకు రోడ్డు నాణ్యమైన బీటీ రోడ్డు నిర్మాణాలు చేపట్టి పల్లె ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరిన స్థానికులు

## మనస్తాపంతో యువకుడి మృతి.



**లక్షెట్టిపేట, జూలై 20 (ప్రజాజ్యోతి):** మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లికి చెందిన రాందేని రాకేష్ (25) అనే వ్యక్తి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, మృతునికి గత ఏడాది క్రితం ఇదే ప్రాంతానికి చెందిన తన మేన మరదలు కావ్యతో వివాహమైందన్నారు. మృతునికి నిన్న ఉదయం ఇంట్లో తన భార్యతో చిన్న గొడవ జరగడంతో తన భార్య వాళ్ళ తండ్రిని పిలిపించుకుని పుట్టింటికి వెళ్ళిపోయిందన్నారు. భార్య చిన్నపాటి గొడవకే తండ్రిని పిలిపించుకొని వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన రాకేష్ ఇంట్లో ఉన్న పంటకు పిచికారీ చేసే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు రాకేష్ ను లక్షెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుని తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# చాకచక్యంగా స్క్రాప్ దొంగలను పట్టుకున్న సింగరేణి ఎంటీఎఫ్

## రూ.60 వేల విలువైన స్క్రాప్, కేబుల్ స్వాధీనం



**మంచిర్యాల, 20, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-3 భూగర్భ గనిలో స్క్రాప్, విలువైన కేబుల్స్‌ను చోరీ చేసేందుకు యత్నించిన దొంగలను సింగరేణి మొబైల్ టాస్క్ ఫోర్స్ (ఎంటీఎఫ్) సిబ్బంది చాకచక్యంగా పట్టుకుని, భారీ మొత్తంలో స్క్రాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి ఎస్ఆర్పీ-3 భూగర్భ గనిలో కొందరు దుండగులు ఇనుప స్క్రాప్‌తో పాటు విలువైన డ్రిల్ కేబుల్స్‌ను అపహరించేందుకు ప్రయత్నించారు. విధుల్లో ఉన్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అనుమానాస్పద కదలికలను గమనించి వెంటనే ఎంటీఎఫ్ (మొబైల్ టాస్క్ ఫోర్స్) సిబ్బందికి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న వెంటనే ఎంటీఎఫ్ బృందం సంఘటన స్థలానికి చేరుకోగా, వారిని గమనించిన దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం గని పరిసరాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టిన ఎంటీఎఫ్ సిబ్బందికి ప్రహరీ గోడ సమీపంలో దాదాపు 50 నుంచి 60 మీటర్ల డ్రిల్ కేబుల్ లభ్యమైంది. దానిని స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో బంకర్‌పై ఉన్న ఎస్డీఎల్ కేబుల్ కనిపించడం లేదని సమాచారం అందడంతో గని పరిసర ప్రాంతాల్లో మరింత ముమ్మరంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున సుమారు ఉదయం 5 గంటల సమయంలో ఎస్ఆర్పీ-3 గని ప్రధాన సబ్‌స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ ఆటోను ఎంటీఎఫ్ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. ఆటోను తనిఖీ చేయగా అందులో ఉన్న రమేష్ అనే వ్యక్తి పరారవగా, ఆటో డ్రైవర్ శ్రీధర్ను అదుపులోకి తీసుకున్నారు. ఆటోలో ఉన్న సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల విలువైన ఐరన్ స్క్రాప్‌తో పాటు డ్రిల్ మిషన్ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు.రికవరీ చేసిన ఐరన్ స్క్రాప్, కేబుల్స్‌తో పాటు ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సింగరేణి అధికారులు తెలిపారు. గనుల్లో చోరీలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# బి వి జి రామ్ జి పనులను ప్రారంభించిన ఎంపీడీవో రాథోడ్ రాధా



**ఖానాపూర్ జూలై 20( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని సింగపూర్ గ్రామంలో బి వి జి రామ్ జి పథకంలో ఫారం ఫౌండ్ నిర్మాణ పనులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాథోడ్ రాధా సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు పర్యటనలో భాగంగా సింగాపూర్ గ్రామాన్ని సందర్శించి ప్రతి ఇంటికి ఇంకుడు గుంత పంట పొలాలకు ఊట గుంతలు నిర్మించుకోవాలని ఈ సందర్భంగా కోరారు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని అర్హతలు ఉన్న రాణి పనులకు సంబంధిత గ్రామ కార్యదర్శి తో పాటు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా రాస మల్లఅశోక్



**ఖానాపూర్ జూలై 20( ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్ మండలం దిలావర్పూర్ గ్రామానికి చెందిన రాస మల్ల అశోక్ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు కవంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు కట్ట షాప్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి కమిటీని నియమించినట్లు తెలిపారు అశోక్ కాంగ్రెస్ పార్టీ యువజన సోషల్ మీడియా పదవితో పాటు పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి కృషి చేశారని ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిలి శంకర్ పట్టణ అధ్యక్షులు గౌరె గంగాధర్ డిసిసి ఉపాధ్యక్షులు రాజుర సత్యం అధికార ప్రతినిధి ధోనికేని దయానంద్ జిల్లా పార్టీ కార్యదర్శి అంకం రాజేందర్ ఖానాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ తోటసత్యం తదితర కాంగ్రెస్ శ్రేణులు దిలావర్పూర్ గ్రామ స్తులు అశోకుని అభినందించారు

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మధ్యలోనే ఆపి పారిపోయిన కాంట్రాక్టర్

న్యాయం చేయాలని కోరుతున్న బాధితుడు



**జన్నారం,జూలై20(ప్రజాజ్యోతి)**పేదోడి సొంతింటి కల నెరవేర్చ డానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళు పథకానికి శ్రీకారం చుట్టింది. కానీ కొందరి కాంట్రాక్టర్ల వల్ల వారి కల నెరవేరకుం డానే పోయింది. మండలంలోని జన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని వరద బాధితుల కాలనీ కి చెందిన మరసుకొల గీత శ్రావణ్ కుమార్ లు వారి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ కు చెందిన మహమ్మద్ యూసుఫ్ అనే కాంట్రాక్టర్ కి ఇంటి నిర్మాణాన్ని గుత్తకి ఇచ్చారు. స్లాబ్ వరకు నాణ్యత లేకుండా నిర్మాణం చేసి బిల్లులు లేపుకుని నిర్మాణాన్ని మధ్యలోనే ఆపేసి ఉడాయించాడు.నాలుగు నెలలుగా ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని,ఇంటి నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడం తో వారు కన్నీరు కారుస్తూ వినిపిస్తున్నారు. తమని మోసం చేసిన కాంట్రాక్టర్ పై అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.ఇలాంటి కాంట్రాక్టర్లు మండలంలో నలుగురు ఉన్నారని, మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారుల కు చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను మధ్యలోనే ఆపేసి బిల్లులతో ఉడాయించి బాధితులను మోసం చేసినట్లు వినికిడి. అధికారులు అట్టివారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ఝరి-పూనగూడ ఆశ్రమ పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం

మొక్కలు నాటండి అవి మనకు నీడతో పాటు స్వచ్ఛమైన ఆక్సిజన్ ను అందిస్తాయి.

మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రిన్సిపల్ సరస్వతి




**అదిలాబాద్ టౌన్, జూలై 20 ( ప్రజా జ్యోతి )** తలమడుగు మండలం ప్రభుత్వ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల ఝరిపున గూడ లో సోమవారం పర్యావరణ పరిరక్షణ, పాఠశాల అభివృద్ధే ధ్యేయంగా ఉపాధ్యాయులు అభినందనీయమైన కార్యక్రన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ముఖ్య విశేషాలు:మొక్కల వితరణ: పాఠశాల శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఫిజికల్ డైరెక్టర్ రాథోడ్ శ్రీనివాస్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు నిమ్మల బోజారెడ్డి కలిసి 20 మొక్కలను దాతలు (డోనర్స్) గా పాఠశాలకు అందజేశారు. అభినందనల వర్షం: పాఠశాల పచ్చదనం కోసం నిరంతరం కృషి చేస్తున్న వీరి ఉదారతను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. సరస్వతి ప్రత్యేకంగా అభినందించారు. సహచర ఉపాధ్యాయుల మద్దతు: ఈ కార్యక్రమంలో పాల్గొన్న తోటి ఉపాధ్యాయులు సుంగు, రాథోడ్ కిషన్, రమేష్, పొతన్న, గంగయ్య, ఆడే ధరమ్ సింగ్, కమలాకర్, ప్రభాకర్, మరియు వార్డెన్ రాము గారు దాతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు తమ హృదయపూర్వక అభినందనలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా విద్యార్థులకు పర్యావర ణంపై అవగాహన కల్పించవచ్చని ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం పేర్కొంది.

# సింగరేణిలో 159 అంతర్గత ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**ఫిట్టర్ ట్రైనీ, ఎలక్ట్రీషియన్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం..**

**ఆగస్టు 2 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు**

**మంచిర్యాల, 20, జులై (ప్రజాజ్యోతి):**సింగరేణి కొలియరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కొత్తగూడెం కొలియరీస్‌లో అంతర్గత అభ్యర్థుల ద్వారా నాన్-ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. సీఆర్పీ/పీఈఆర్/ఆర్/2026/401 నంబర్‌తో సోమవారం జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం మొత్తం 159 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీల్లో ఫిట్టర్ ట్రైనీ (కేటగిరి-1) -- 96 పోస్టులు, ఎలక్ట్రీషియన్ ట్రైనీ (కేటగిరి-1) -- 63 పోస్టులు ఉన్నాయి. అర్హత కలిగిన అంతర్గత ఉద్యోగులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూలై 20 సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమై ఆగస్టు 2 సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అనంతరం ఆన్‌లైన్ దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు విద్యార్హత, సర్వీస్, ఇతర అవసరమైన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను సంబంధిత విభాగాధిపతుల ద్వారా సమర్పించాలి. యూనిట్ స్థాయిలో హార్డ్ కాపీల స్వీకరణకు ఆగస్టు 5, ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయానికి పంపేందుకు ఆగస్టు 8, కార్పొరేట్ కార్యాలయంలోని జనరల్ మేనేజర్ (పర్సనల్) ఈశా అండ్ ఆర్‌సీ కార్యాలయానికి చేరే చివరి తేదీ ఆగస్టు 11, 2026గా నిర్ణయించారు. గడువు తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. అభ్యర్థుల దరఖాస్తులను గనులు, విభాగాల అధిపతులు పూర్తిగా పరిశీలించి, సర్వీస్




వివరాలు, విద్యార్హతలు, అనుభవం, రెగ్యులర్ లేదా దూరవిద్య ద్వారా పొందిన అర్హతలు తదితర అంశాలను ధ్రువీకరించిన అనంతరం మాత్రమే సంబంధిత ఏరియా కార్యాలయాలకు పంపాలని ఆదేశించారు. ప్రతి అభ్యర్థికి సంబంధించిన అసెస్‌మెంట్ రిపోర్టును ఎస్‌ఏపీ డేటా ఆధారంగా సిద్ధం చేసి సీల్డ్ కవర్‌లో దరఖాస్తుతో జతచేయాలని తెలిపారు. సేవలో ఉండగానే విద్యార్హతలు పొందిన ఉద్యోగులు సంబంధిత మార్గదర్శకాల ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తప్పనిసరిగా సమర్పించాలి. అంతర్గత అభ్యర్థులకు వయోపరిమితి లేదని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. ఎంపిక ప్రస్తుత నియామక నిబంధనల ప్రకారం జరుగుతుందని, రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు అమలులో ఉన్న నిబంధనల మేరకు టీఏ, డీఏ చెల్లించనున్నట్లు వివరించారు.

## పొన్కల్ లో మొక్కలు నాటిన ఏఎస్ఐ, సర్పంచ్



**మామడ జూలై 21 ( ప్రజా జ్యోతి)** ప్రతి ఒక్కరూ గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్పంచ్ చిట్యాల లక్ష్మీ రాజారెడ్డి కోరారు. మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఎస్ఐ గంగారం నాయక్ హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, స్థానిక నాయకులు ఎలిగేటి వంశీ కృష్ణ నేత గ్రామస్తులు మేదరి ముత్యం, శ్రీను, గిరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాజీవ్ నగర్ విద్యార్థుల బోనాల సాంప్రదాయ పోతరాజుల విన్యాసం

**తెలంగాణ సంస్కృతిని కాపాడాలి**

**డిసిసి ఉపాధ్యక్షులు రాజు రా సత్యం**



**ఖానాపూర్ జూలై 20 (ప్రజా జ్యోతి)** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల్లో మొదట బోనాల పండుగలోని పోతరాజుల విన్యాసాలుఖానాపూర్ పట్టణంలోని 11వ వార్డులో గల రాజీవ్ నగర్ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమం హర్షనీయమని వార్డు కౌన్సిలర్ డిసిసి ఉపాధ్యక్షులు రాజుర సత్యం అన్నారు ఈ సందర్భంగా బోనాలు పోతురాజుల ఊరేగింపు సంప్రదాయ పద్ధతిలో విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ఏర్పాటు చేయడం అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గేయలత రాజమణి విజయలక్ష్మి రామలక్ష్మి సునీత విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## చెన్నూర్ మున్సిపాలిటీలో వేగంగా సాగుతున్న ఎస్ఆర్ఐ ప్రక్రియ పరిశీలన

**ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా పనిచేయాలి**

**డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి**

**మంచిర్యాల, 20, జులై (ప్రజాజ్యోతి):** చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఆర్ఐ (ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ) ప్రక్రియను సోమవారం గౌరవ మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి మరియు చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట్య నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెన్నూర్ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన వారు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు), కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్‌ఏలు)తో మాట్లాడి, ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను సేకరించి, నిర్ణీత గడువులోపు బీఎల్‌ఓలకు అందజేయాలని బీఎల్‌ఏలకు సూచించారు. ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణల ప్రక్రియను



పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మహేష్ ప్రసాద్ తివారి, చెన్నూర్ మండల ఇంచార్జ్ కొండు వెంకటేష్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సాహిర్, గాజ్జల అంకాగౌడ్, ఎం.డి. ఖలీల్, పాతర్ల నాగరాజు, లింగంపల్లి మహేష్, ఎం.డి. సుల్తాన్, దాసరి కమలాకర్, తనుగుల రవి, మధ్యల సురేష్, భీమ్ మధు, వసీం, ఎస్.డి. మెహతసిర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకూడదు.

**--- మంచిర్యాల డీసీపీ భాస్కర్ .**

**లక్షెట్టిపేట, జూలై 20(ప్రజాజ్యోతి) :**పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకూడదని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సోమవారం సాయంత్రం అన్నారు. పట్టణంలోని గోదావరి వద్ద వచ్చే ఏడాది ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న పుష్కరాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అంతే కాకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. సాధ్యమైనంత మేరకు పార్కింగ్ స్థలాన్ని గోదావరికి కాస్త దూరంలో ఉంచాలని తహసీల్దార్ దిలీప్ కుమార్ తో చర్చించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎలాంటి క్రైమ్ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. పుష్కరాల ఏర్పాట్లపై పోలీస్ అధికారులు



అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పరిశీలనలో డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాష్,తహసీల్దార్ దిలీప్ కుమార్,సీ ఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డులో రామగుండం కరాటే విద్యార్థుల సత్తా

**విజేతలను ఘనంగా సత్కరించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**




**మంచిర్యాల, 20, జులై (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 26న నిర్వహించిన లార్జెస్ట్ కరాటే గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమం విజయవంతంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,900 మంది విద్యార్థులు, సీనియర్ కరాటే మాస్టర్లు పాల్గొనగా, వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 1,212 మంది విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. ఈ ప్రతిష్ఠాత్మక విజయాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగుండానికి చెందిన జపాన్ షిటో ర్యూ కరాటే స్కూల్ విద్యార్థుల్లో 25 మంది విద్యార్థినీ, విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి రామగుండానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన విద్యార్థులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేకంగా అభినందించి, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, కరాటే అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే గొప్ప మార్షల్ ఆర్ట్ అని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు స్వీయరక్షణ కోసం కరాటేను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఇంకా ఎన్నో గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జపాన్ షిటో ర్యూ కరాటే స్కూల్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ అండ్ బెల్ట్ ఎగ్జామినర్ కరాటే శ్రీనివాస్ పాల్గొనడం సంస్థకు గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు ఎస్. శ్రీనివాస్, శ్రావణ్ పటేల్, సంజన, అభిజ్ఞ, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీరామ్, స్పందన క్లబ్ కార్యదర్శి డాక్టర్ కె. నరేంద్ర సోనీ, చిరంజీవి ఆదిత్య, స్వామి, గణేష్ రాజ్తో పాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు అభినందనలు తెలిపారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు ఇవ్వొద్దు

**జిల్లా కలెక్టరేట్ ముట్టడి.. డీఈఓ కార్యాలయానికి వినతిపత్రం**

**విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలంటే కార్మికుల ద్వారానే పథకాన్ని కొనసాగించాలి:**

**సీఐటీయు నాయకులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్**






**మంచిర్యాల, 20, జులై (ప్రజాజ్యోతి):** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ (డీఈఓ) కార్యాలయ సూపరింటెండెంట్ వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ, జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గత ఎన్నో సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం తయారు చేసి అందిస్తున్నారని తెలిపారు. అలాంటి కార్మికులను పాఠశాలల నుంచి తొలగించి పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేయడం ప్రభుత్వ కుట్రగా అభివర్ణించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడంలో ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. గత ఏడాది హనుమకొండ జిల్లాలో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారని, అక్కడ ప్రైవేటు సంస్థలు అందించిన భోజనం రుచికరంగా లేకపోవడంతో పాటు నాణ్యత కూడా సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అలాంటి విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాగం రాజారాం మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులతో కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయు) జిల్లా నాయకులు ఎం.డి. రఫియా, ఎం.డి. కరీమా మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన కార్మికులను ఎలాంటి కారణం లేకుండా తొలగించడం సరికాదన్నారు. ఒకవేళ వారిని తొలగిస్తే రాష్ట్ర ప్రభుత్వం వారికి రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కార్మికుల ద్వారానే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని కాపాడే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు చల్లూరి దేవదాస్, అంబటి లక్ష్మణ్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం లక్ష్మి, సరిత, ఉమా, రమాదేవి, సవిత, కాంతమ్మ, సేపూరి లక్ష్మి, బుచ్చమ్మ, వరలక్ష్మి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా నాయిని సంతోషం ఏకగ్రీవం



**ఖానాపూర్ జూలై 20 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ లో గల మున్నూరు కాపు సంఘం భవనంలో నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటు చేశారు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా నాయిని సంతోష్ సంతోషం ఎన్నుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు అందరితో కలిసి కాపు సంఘ సమాజానికి ప్రభుత్వపరంగా ఇతరత్రా అవకాశాలను సద్వినియోగం చేసుకొని సంఘ అభివృద్ధితో పాటు ఈ వర్గాల్లో గల వారికి ఆర్థికంగా సామాజికంగా విద్య, రాజకీయపరంగా పెరిగేందుకు అందరూ ఏకతాటిపై నడవాలని కాపు సంఘ పెద్దలను కోరారు ఈ కార్యక్రమంలో తోట సత్యం గుమ్ముల లక్ష్మణ్ సంద పోశెట్టి పాదం రాజారెడ్డి ముల్తాని సాయన్న సల్ల చంద్రహాస్ సల్ల శ్రీనివాస్ చిలుకూరి ఇస్తారి గడుపు రాజేశ్వర్ నాయిని శంకర్ నాయిని రాజేశ్వర్ చిలుకూరి గంగ నరసయ్య గుమ్ముల చిన్న రాజేశ్వర్ సంద చిన్న పోశెట్టి పసుపుల నరేందర్ కొక్కుల గంగన్న కొక్కుల రాజారెడ్డి రోడ్డ శంకర్ నాయిని రవి రాగం గణేష్ ఎన్ శెట్టి రవి సల్ల మొగిలి అయిందాల పెద్ద నరసయ్య దాసరి నారాయణ గాద్దు చందు కొక్కుల రాజన్న గాద్దు రవి గుమ్ముల అశోక్ సల్ల చిన్న రాజేశ్వర్ ఆరే నగేష్ ఎలిశెట్టి రవికాంత్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## పిల్లలు కనిపించడంలేదని తండ్రి ఫిర్యాదు

**భార్యనే తీసుకెళ్లిందని తేల్చిన పోలీసులు.**



**జన్నారం,జూలై20 (ప్రజాజ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ కు చెందిన వేలాడి సంతోష్ కుమార్ తన ముగురు పిల్లలతో సోమవారం రోజున కరీంనగర్ నుండి దస్తురాబాద్ గ్రామానికి వెళ్తున్న క్రమంలో జన్నారం మండలంలోని కలమడుగు విలేజ్ లోని దస్తురాబాదు రోడ్డు వద్ద తన ముగ్గురు పిల్లలతో ఆటో కేశం వేసి చూస్తుండగా తన ముగ్గురు పిల్లలు కనబడడం లేదని జన్నారం పోలీస్ స్టేషన్లో తెలియజేయగా మంచిర్యాల ఏసిపి, లక్షెట్టిపేట సిఐ ఆదేశాల మేరకు ఎస్సై ఉదయ్ కిరణ్ మరియు సిబ్బంది పిల్లల కోసం రెండు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా వెతకగా సంతోష్ కుమార్ భార్య వేలాడి దేవేంద్ర తన భర్తకు తెలియకుండా పిల్లలను వాహనంలో ఎక్కించుకొని ఆసిఫాబాద్ కు వెళ్లిందని దస్తురాబాద్ లోని గోండుగూడ పెద్దలు పిల్లలను వెతకడానికి వెళ్లిన బృందానికి తెలపగా, అట్టి సమాచారం కోసం సంతోష్ భార్యను ఫోన్ ద్వారా సంప్రదించగా పిల్లలను తనే తీసుకెళ్లానని ఎస్సై ఉదయ్ కిరణ్ కి తెలిపారు. తనకు మరియు తన భర్తకు కొన్ని నెలల నుండి గొడవలు జరుగుతున్నాయని, పది రోజుల క్రితం తనకు చెప్పకుండా తన భర్త పిల్లలను తీసుకెళ్లగా ఈరోజు భర్తకు తెలియకుండా నేను పిల్లలను తీసుకెళ్లానని ఆమె ఎస్సై ఉదయ్ కిరణ్ కి తెలిపారు. తన పిల్లల ఆచూకీ కనుగొని, వాస్తవ వివరాలు తెలిపిన జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ కి పోలీస్ సిబ్బందికి తండ్రి వేలాడి సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# కార్పొరేషన్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం





**అండలమ్మ డంపింగ్ యార్డు తరలింపు, గోదావరి వంతెన, రాళ్లవాగు కరకట్ట నిర్మాణంపై పోరాటం చేయాలి**

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, 20, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల కార్పొరేషన్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయిందని , అండలమ్మ డంపింగ్ యార్డు తరలింపు, గోదావరి వంతెన, రాళ్లవాగు కరకట్ట నిర్మాణంపై పోరాటం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పిలుపు నిచ్చారు . మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గర్మిళ్ళ జోన్ బీజేపీ కార్యవర్గ సమావేశం సోమవారం జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పార్టీ చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ వాటి పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ముఖ్యంగా అండలమ్మ కాలనీలోని డంపింగ్ యార్డు సమస్యను వెంటనే పరిష్కరించి, జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే గోదావరి నదిపై వంతెన నిర్మాణం చేపట్టడంతో పాటు రాళ్లవాగుపై శాశ్వత కరకట్ట నిర్మించి వరదల నుంచి ప్రజలను రక్షించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రధాన సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రానున్న 2028 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ బీజేపీ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అమిరిశెట్టి రాజ్‌కుమార్, పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, మోతపలుకుల తిరుపతి, దేగ బాపు, పచ్చ స్వప్నరాణి, ఆడే ప్రేమ్‌సింగ్, ముచ్చుకుర్తి కిషోర్, మెరెడిగొండ శ్రీనివాస్, బింగి సత్యనారాయణతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగాపూర్ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు



**దండేపల్లి జూలై 20 (ప్రజాజ్యోతి)** మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్మించిన తెలంగాణ మోడల్ స్కూల్ ఌ కాలేజ్‌లో ఇటీవల మరమ్మతులు పూర్తి చేసుకున్న బాలికల హాస్టల్ భవనాన్ని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పరిశీలించారు.?ఈ సందర్భంగా ఆయన హాస్టల్ భవనంలో చేపట్టిన మరమ్మతు పనులను, నాణ్యతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించి అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు సరిగ్గా అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు.?ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,అర్జీపీఆరెస్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విజ్ఞతను సన్మానించిన మున్నూరు కాపు సంఘం




**ఖానాపూర్ జూలై 20 (ప్రజా జ్యోతి )** రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతి కనబరిచిన ఖానాపూర్ మండలం మస్కాపూర్ ప్రభుత్వ హైస్కూల్ పదవ తరగతివిద్యార్థిని రాగం విజ్ఞత తండ్రి గణేష్ లను ఖానాపూర్ మున్నూరు కాపు సంఘం సోమవారం ఘనంగా సన్మానించారు విద్యార్థిని అంచలంచలుగా రాష్ట్ర స్థాయికి ఎదగడం గర్వకారణమని ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు నాయన సంతోష్ పలువురు కాపు సంఘ సభ్యులు అభినందించారు కాగా మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో క్రమశిక్షణతో చదువుతూ క్రీడల పట్ల ఆసక్తితో వెయిటింగ్ లిఫ్ట్ లో రాష్ట్రస్థాయిలో మూడు రౌండ్ల గాను ఫస్ట్ టైం లోనే ఐదో స్థానం రెండవ రౌండ్లో మూడో స్థానం ఎదిగిన విద్యార్థిని విజ్ఞత రాష్ట్రస్థాయిలో ఫస్ట్ రాంక్ సాధించవచ్చు అని పాఠశాల పిడి ఇమ్రాన్ అన్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ విద్యార్థిని అభినందించారు

## యువ సంగ్రామ సభను చూసి భయపడుతున్న కాంగ్రెస్ పార్టీ: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేవి శంకర్



**సారంగాపూర్, జులై 20 (ప్రజా జ్యోతి):**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ దేవి శంకర్ విమర్శించారు. కేటీఆర్ నాయకత్వంలో నిర్వహించిన యువ సంగ్రామ సభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో, ముఖ్యంగా యువత మరియు నిరుద్యోగుల్లో పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే ఆధారరహిత విమర్శలు చేస్తోందని ఆయన అన్నారు.2023 మే 8న సరూర్‌నగర్‌లో నిర్వహించిన యూత్ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సమక్షంలో సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ లెక్కన ఇప్పటివరకు ఐదు లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 70 వేల ఉద్యోగాలకే పరిమితమైందని ఆరోపించారు. జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గురుకుల ఉపాధ్యాయుల నియామకాల నోటిఫికేషన్లు ఇంకా విడుదల కాలేదని పేర్కొన్నారు. అలాగే ప్రతి సంవత్సరం 25 వేల మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పిన హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు.నిరుద్యోగ భృతి, ఇంటర్ పూర్తి చేసిన ప్రతి మహిళకు స్కూటీ వంటి ఎన్నికల హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సాక్ పెల్లి సురేందర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## అంకుషాపూర్‌లో మహిళా, బాలల గ్రామసభలు నిర్వహణ

**మహిళా సంక్షేమం, బాలల హక్కులపై అవగాహన**



**ఆసిఫాబాద్, జూలై 20 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలంలోని అంకుషాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం మహి ళా గ్రామసభతో పాటు బాలల గ్రామసభను విజయవంతంగా నిర్వహించారు. మహిళాగ్రామసభలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి కవిత, గ్రామంలోని మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. మహిళల సంక్షేమం, ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, గ్రామ పరిశుభ్రత, గ్రామాభివృద్ధి వంటి అంశాలపై చర్చించి, మహిళల అభిప్రాయాలు, సూచనలను స్వీకరించారు.అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని తెలివాడ పాఠశాలలో బాలల గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టేకం గంగారం, ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రేవతి, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీమతి కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు. బాలల హక్కులు, పరిశుభ్రత, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, గ్రామాభివృద్ధిలో పిల్లల భాగస్వామ్యం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ టేకం గంగారం మాట్లాడుతూ మహిళలు, పిల్లల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, గ్రామసభల్లో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ సూచనలు అందించాలని కోరారు.

## కెరమెరి నూతన ఎస్సై శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు



**కెరమెరి జూలై 20 ప్రజా జ్యోతి** కెరమెరి పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్ ను సోమవారం కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ తో పాటు ప్రజలు, కార్మికులు, విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై సత్వర స్పందనతో న్యాయం చేయాలని కోరారు. ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం మండల కన్వీనర్ కూటికేల ఆనంద్‌రావు, మండల సహాయ కన్వీనర్ మాదవి అనిల్‌కుమార్, విద్యార్థి సంఘం జిల్లా కమిటీ సభ్యుడు సతీష్‌తో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పుష్కరఘాట్ ఏర్పాట్లపై డీసీపీ ఆకస్మిక తనిఖీ.

– పోలీసు భద్రతకు ప్రత్యేక చర్యలు



**దండేపల్లి, జూలై 20(ప్రజాజ్యోతి ):** దండేపల్లి మండలంలోని గూడెం గోదావరి వద్ద వచ్చే ఏడాది ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ భాస్కర్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేసి ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని, పార్కింగ్ స్థలాలను గోదావరి ఘాట్‌కు కొంత దూరంలో ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా ప్రత్యేక కంట్రోల్ రూమ్, వాచ్ టవర్‌ల నిర్మాణం, ఘాట్ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ ఏర్పాట్ల ద్వారా భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడం, ఎలాంటి నేరాలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం సులభమవుతుందని తెలిపారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను అమలు చేయాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, లక్సెట్టిపేట, దండేపల్లి ఎస్సైలు గోపతి సురేష్, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లో ప్రతిభ కనబరిచిన డా. సుమీత్‌కు ఘన సన్మానం




**సారంగాపూర్ , జూలై 20:ప్రజా జ్యోతి** వివేకానంద ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి డా. సుమీత్ నీట్ (నీట్ ) పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో విజయం సాధించిన సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు వివేకానంద పాఠశాల లో విద్యాభ్యాసం చేసిన సుమీత్ కృషి, పట్టుదలతో ఈ అరుదైన విజయాన్ని సాధించడం పాఠశాలకు గర్వకారణమని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సముద్రల గీత ,ప్రిన్సిపాల్ నేరెళ్ల ఉషారాణి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి అభినందించారు. భవిష్యత్తులో వైద్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. "మా పాఠశాల పూర్వ విద్యార్థి డా" సుమీత్ సాధించిన ఈ విజయం విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం. ఆయనకు హృదయపూర్వక అభినందనలు, ఉజ్వల భవిష్యత్తు కలగాలని కోరుకుంటున్నమని అన్నారు.

## సిడాం శంభు స్ఫూర్తితో నేటి తరం ఆదివాసీ నాయకులు ఉద్యమాలు చెయ్యాలి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20(ప్రజా జ్యోతి)** ఆదివాసి గిరిజన సమస్యల సాధన పోరాట యోధుడు సిడాం శంబు స్ఫూర్తితో నేటి తరం ఆదివాసి నాయకులు యువకులు, ఉద్యమాలు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వేద్మ బొజ్జు పటేల్ పి లుపునిచ్చారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 8వ వర్ధంతి సందర్భంగా శంభు కి ఎమ్మె ల్యే ఘణంగా నివాళులర్పించారు. ఆదివాసీ ఉద్యమ నాయకులు తుడుందెబ్బ వ్యవస్థాపకులు స్వర్గీయ సి డాం శంభు 8 వ వర్ధంతి సందర్భంగా ఉట్నూర్ మండలం మత్తడిగూడలో ఆయన సమాధి వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘణంగా నివాళులు అర్పించిన అనంతరం ఆయన మా ట్లాడుతూ ఆదివాసీ సమాజం మంచి ఉద్యమకారున్ని కోల్పోవడం చాలా బాధాకరమని, చూస్తూ ఉండ గానే ఆయన మరణించి 8 సంవత్స రాలు గడిచిపోయాయి అని, తక్కువ వయసులోనే ఆయన మరణించడం ఆదివాసీ సమాజా నకి తీరనిలో టని,నేటి ఆదివాసీ యువత వారి స్ఫూర్తితో ఆదివా సీ హక్కుల కోసం ఉద్యమాలు చెయ్యాలని, ఆ మహాను భావుడి విగ్రహ ఏర్పాటుకు అనేకసార్లు ప్రస్తావన తీసుకొచ్చినప్పటికీ వారి కుటుంబ సహకరంతోనే అది సాధ్యమని అన్నారు. ఎలాంటి భేష భావాలు లేకుండా శంభు కుటుంబంలో పెళ్ళైన అందరికీ తమ ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, వారు మంచి ఇళు కట్టుకొని, శంభు ఆశీర్వాదంతో సమాజంలో గొప్ప గా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కా ర్యక్రమంలో ఆదివాసీ నాయకులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో తొలి ముద్దు అల్పాహారం

ప్రారంభించిన సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి



**సిరికొండ, జూలై 20, (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో ఉ న్న చిన్న పిల్లలకు పౌష్టికార అందించే లక్ష్యంతో ప్రారంభించిన తొలిముద్దు కార్య క్రమాన్ని సిరికొండ మండల కేంద్రంలో అంగన్వాడి 2 సెం టర్ లో సోమవారం స్థానిక సర్పంచ్ బొడ్డు దత్తాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డు దత్తాత్రి మాట్లాడుతూ ప్రభుత్వం 3 నుంచి 6 సంవత్సరాల పిల్ల లకు పౌష్టికాహారం అందించాలని సంకల్పించి అంగన్వాడీ కేంద్రానికి ప్రొద్దున వెళ్లగానే తొలి ముద్దుగా అల్పాహారాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వము ఉప్మా మిశ్రమాన్ని, కిచిడి మిశ్రమాన్ని, గుడ్లు, పాలును కూడా అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చదువు తో పాటు వారి ఆరోగ్యం పట్ల దూర దృష్టితో ఆలోచించి పిల్లల యొక్క బలహీనత ను గుర్తించి వారి ఆరోగ్యం బాగుండాలని వారికి పౌష్టి కాహారంతో పాటు అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న పిల్లలకు ఉచిత బట్టలు, ఆట వస్తువులు సరఫరా చేస్తున్నారని, అంగన్వాడి కేంద్రా లకు పిల్లల ను పంపించి వాటిని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ కార్య క్రమానికి శ్రీకారం చుట్టిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగ న్వాడి టీచర్ సిద్ధ వేణి రాణి, వార్డ్ మెంబర్ ముక్రం, గురుమూర్తి, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

## సోనాలలో గస్తీ తిరుగుతున్న గ్రామస్తులు




**సోనాల జూలై 20 ప్రజా జ్యోతి** గ్రామంలో వరుసగా చోటుచేసు కుంటున్న దొంగతనాల ఘటనలతో సోనాల గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామాన్ని కాపాడుకునేందుకు తమకు తామే రంగంలోకి దిగారు. వయసుతో సంబంధం లేకుండా యువకులు, పెద్దలు గుంపులుగా ఏర్పడి అర్ధరాత్రి వేళల్లో వీధుల్లో పహారా కాస్తున్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో 'నైట్ వాచ్'గత కొన్ని రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు వదంతులు రావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది, యువజన సంఘాలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నాయి. గ్రామ సరిహద్దులు, ముఖ ద్వారాలు మరియు ప్రధాన వీధుల్లో వేర్వేరు బృందాలుగా ఏర్పడి రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు లాఠీలు, బ్యాటరీ లైట్లతో గస్తీ నిర్వహిస్తున్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా కనిపించే వాహనాలు గ్రామంలోకి వస్తే వెంటనే ప్రశ్నిస్తున్నాం" అని స్థానిక యువకులు తెలిపారు.

# అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణానికి కృషి

ఆత్రం సుగుణక్క

**కెరమెరి, జూలై 20 ప్రజా జ్యోతి** కెరమెరి మండలంలోని అనార్‌పల్లి వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలని స్థానిక గ్రామస్తులు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సుగుణక్క కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి వాగును ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామస్తులు మాట్లాడుతూ వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో అనార్‌పల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, ప్రజల సమస్య ను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్కను కలిసి అనార్‌పల్లి వాగుపై శాశ్వత వంతెన



నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదివాసులు శంభు ఆశయాలను నెరవేర్చాలి

8వ వర్ధంతి సందర్భంగా

సిడంశంభు నివాళి అర్పించిన ఎమ్మెల్యే

సిడం శంభు కుటుంబసభ్యులకు ఇందిరమ్మ

ఇండ్లు మంజూరు వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్ జూలై 20 (ప్రజా జ్యోతి )**ఆదివాసీ ఉద్యమ నాయకులు తుడుందెబ్బ వ్యవస్థాపకులు స్వర్గీయ సిడం శంభు 8 వ వర్ధంతి సందర్భంగా ఉట్నూర్ మండలం మత్తడిగూడలో ఆయన సమాధి వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఘన నివాళులు నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సమాజం మంచి ఉద్యమకారున్ని కోల్పోవడం చాలా బాధాకరమని చూస్తు ఉండగానే ఆయన మరణించి 8 సంవత్సరాలు గడిచిపోయాయి అని,తక్కువ వయసులోనే ఆయన మరణించడం ఆదివాసీ సమాజానికి తీరని లోటని,నేటి ఆదివాసీ యువత వారి స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమాలు చెయ్యాలని,ఆ మహానుభావుడి విగ్రహ ఏర్పాటుకు అనేకసార్లు ప్రస్తావన తీసుకొచ్చినప్పటికీ వారి



కుటుంబ సహకరం తోనే అది సాధ్యమని అన్నారు.ఎలాంటి భేష భావాలు లేకుండా శంభు కుటుంబంలో పెళ్ళైన అందరికీ మా ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాను అని ఎమ్మెల్యే అన్నారు ,మంచి ఇళ్లు కట్టుకొని, శంభు ఆశీర్వాదంతో సమాజంలో గొప్పగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటానని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘణంగా స్వర్గీయ చిలకూరి రాంచంద్ర రెడ్డి వర్ధంతి

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదిలాబా ద్ అభివృద్ధి ప్రధాత, మాజీ మంత్రి స్వర్గీయ చిలుకూరి రామచంద్రారెడ్డి మూడవ వర్ధంతి కార్యక్రమం ఘణంగా నిర్వహించారు. ఆదిలాబాద్ అభివృద్ధికి చేసిన కృషిని ఆయన చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకోన్నారు. ఈ సందర్భంగా గుడిహత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు తొడసం దౌలత్ రావు మాట్లాడుతూ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా సేవలందించి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి, ఆదిలాబాద్ లో మత్తడి వాగు ప్రాజెక్టు, రిమ్స్ కళాశాల ఆయన కృషి వల్ల ఏర్పడ్డాయని అయన గుర్తు చేసుకున్నారు, ప్రతి ఒక్క కార్యకర్తని పేరు పెట్టి పిలిచేవారని ఆయన ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ




బలోపేతానికి ఎంతో కృషి చేశారని, జిల్లా వ్యా ప్తంగా అభిమానుల ను సంపాదించుకున్నారని ఈసంద ర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్ సి డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు పరమేశ్వర్, డే బై డే కోఆర్డినేటర్ భూపల్లి శ్రీధర్, పట్టణ అధ్య క్షులు కిజార్ పాషా, మైనార్టీ జిల్లా అధ్యక్షులు షహీద్,మిర్జా యాకుబ్ బైగ్, ప్రేమల, వార్డు ఇంచార్జి ఫహీమ్, బండారి సతీష్ ,తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో నింది తుడికి రూ.20 వేల జరిమానా

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20, (ప్రజా జ్యోతి)**బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నం.146/ 2024, సెక్షన్ 75(1)(అఅ) బీ ఎన్ఎస్ కేసులో నిందితుడు సోలంకి సుందర్ సింగ్ (43), పునియా నాయక్ తండా, సోనాల మండలానికి చెందిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్ రావు రూ. 20,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. 2024లో బాధితురాలు కౌలుకు తీసుకున్న వ్యవసాయ పొలంలో పని చేస్తున్న సమయంలో నిందితుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై బాధితు రాలి ఫిర్యాదు మేరకు అప్పటి బోథ్ ఎస్ఐ ప్రవీణ్ కేసు నమోదు చేశారు. అనంతరం సీడీఓ 8 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రహీం సమర్థవంతంగా వాదనలు వినిపించి నేరాన్ని రుజువు చేశారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు నిందితుడికి రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసు నందు ప్రతిభ కనబరిచిన కోర్టు డ్యూటీ అధికారి, కోర్టు లైసెన్ అధికారులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

## నార్త్ మెసిడోనియాలో జగన్నాథ యాత్ర



**కడెం,జులై 20(ప్రజా జ్యోతి):** నార్త్ మెసిడోనియా లో జీవన ఉపాధి కోసం వెళ్లిన భారతీయులు జగన్నాథ యాత్రను ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ అదిలాబాద్ నిర్మల్ జిల్లా వాసులు విదేశాల్లోనూ తమ భక్తిని చాటుకుంటూ జగన్నాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గడుపు మనోజ్ కుమార్, సాయి, రాజశేఖర్, శేకర్,రాకేష్, సత్య,శ్రీను తదితరులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.

## కోమటిగూడలో సమగ్ర భూ సర్వేపై అవగాహన సదస్సు

సమగ్ర భూ సర్వేలో ప్రతి రైతు భాగస్వామి కావాలి తహసీల్దార్ డి కవిత



**ఆసిఫాబాద్, జూలై 20 ప్రజా జ్యోతి** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కోమటిగూడ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించేందుకు సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ కవిత మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే ద్వారా భూ రికార్డుల్లోని లోపాలను సరిదిద్దడంతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా సర్వేలో పాల్గొని తమ భూముల వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. మండల సర్వేయర్ శైలజ సర్వే ప్రక్రియ, భూరికార్డుల ధ్రువీకరణ, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోతీరాం, ఉప సర్పంచ్ విజయ్, ఆర్ఐ శైలజ, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చిమన్ గూడ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్ర మం

**గుడుంబా, అక్రమ మద్యం స్వాధీనం**

**నిబంధనలు ఉల్లంఘించిన 14 ద్విచక్ర వాహనాలు సీజ్**

**ఇచ్చోడ సీఐ సిహెచ్ రమేష్**





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20, (ప్రజా జ్యోతి)** ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధి చిమన్ గూడ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్ర మాన్ని నిర్వహించినట్లు ఇచ్చోడ సీఐసి హెచ్ రమేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, నలుగురు వ్యక్తుల వద్ద నుంచి 10 లీటర్ల గుడుంబా, 50 లీటర్ల గుడుంబా తయారీకి విని యోగించే బెల్లం ఊట, 3 క్వింటాళ్ల ఇప్పపూలను స్వా ధీనం చేసుకుని ధ్వంసం చే శారు. అలాగే ఓ బెల్ట్ షాపు పై దాడి నిర్వహించి 3.5 లీ టర్ల అక్రమ మద్యాన్ని స్వా ధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదేవిధంగా 35 ద్విచక్ర వాహ నాలను తనిఖీ చేయగా, రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు లేకపోవడం, నిబంధ నలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు అమర్చడం, వాహన పత్రాలు లేకపోవడం వంటి ఉల్లంఘనలపై 14 ద్విచక్ర వాహనా లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు సీఐ సిహెచ్ రమేష్ తెలిపారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయం, అక్రమ మద్యం విక్రయం, చట్ట విరుద్ధ కార్యకలాపాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగు తాయని, ప్రజలు పోలీసుల కు సహకరించాలని సీఐ సిహెచ్ రమేష్ కోరారు. ఈ కార్యక్ర మంలో ఎస్సైలు విక్రమ్, ఎల్ శ్రీ కాంత్, స్పెషల్ పార్టీ పోలీసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ సాధించేవరకు రాజీలేని పోరాటం

**సీసీఐ విషయంలో అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల**

**శంకర్ రాజకీయ డ్రామా**

**మాజీ మంత్రి జోగు రామన్న**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20,(ప్రజా జ్యోతి)**అదిలాబాద్ సిసిఐ సాధించే వరకు రాజీలేని పోరాటం చే స్తామని, సీసీఐ ఏర్పాటు వి షయంలో అదిలాబాద్ ఎ మ్మెల్యే పాయల్ శంకర్ రాజకీయ డ్రామా చేస్తున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ పునరుద్దరణ విషయంలో సిసిఐ సాధన కమిటీ నిర్వహిస్తున్న పోరాటంలో భాగంగా సోమవారం మాధవరావు స్మారక విజ్ఞాన కేంద్రంలోసి సిఐ సాధన కమిటీ కో – కన్వీనర్ విజ్జగిరి నారాయణ అధ్యక్షతన "సిసిఐ పునరు ద్దరణ – ప్రస్తుత పరిణామాలు – భవిష్యత్ ఉద్యమ కా ర్యాచరణ అనే అంశం పైన చర్చా గోష్టి కార్యక్రమం జరిగింది. సిసిఐ రీ ఓపెన్ కోసం జరిగే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ గురించి సుధీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాజి మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ స్థా నిక ఎమ్మెల్యే పాయల శంకర్ అసెంబ్లీలో సీసీఐ పరిశ్ర మపై ఏర్పాటు చేయాలని చెప్పి రాష్ట్ర ప్రభుత్వంతో కు మ్మక్కై ఇప్పుడు అదే సీసీఐ పరిశ్రమ భూములనుఅమ్ము కునేలా ప్రోత్సహించడం ఇది రాజకీయ డ్రామా కాదా అని జోగు రామన్న ప్రశ్నించారు. కేటీఆర్ సమక్షంలో సీసీఐ సాధన కమిటీ ఢిల్లీకి చేరుకొని కేంద్ర మంత్రి కు మారస్వామిని కలిసి సిసిఐ చర్చలు జరపగా సీసీఐ ఏర్పాటుపై ఆశలు చిగురించాయని, సాధన సమితి ఆధ్వర్యంలో పేర్కొనడం జరి గిందని అన్నారు. సిసిఐ పు నర్ ప్రారంభం పై రాష్ట్ర ప్ర భుత్వం సహకరిస్తే సీసీఐ పరిశ్రమను పునర్ ప్రారం భించుకోవచ్చుని, కేవలం స్థానిక బిజెపి ఎంపీ, ఎమ్మె ల్యే కేంద్రంపై సిసిఐ పునర్ ప్రారంభం విషయాన్ని ఒత్తిడి పెంచ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమంజసం కాదన్నారు. ఆంధ్ర రా ష్ట్రంలో విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం వేల కోట్లు నిధు లు మంజూరు చేస్తే. ఆదిలా బాద్ సిమెంట్ పరిశ్రమకు 250 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. బిజెపి ఎంపీ, ఎమ్మెల్యే కాంగ్రెస్ మంత్రులు సిసిఐ భూముల విషయంలో చేసిన డ్రామాతో ఆదిలాబాద్ ప్రజల ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నదని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేను ఆదిలాబా ద్ ప్రజలు గెలిపించిన పరిశ్రమను పట్టించుకోకపోవడం వారి అసమర్ధతకు నిదర్శనం అన్నారు. ఆదిలాబాద్ ప్రజలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కుట్రను చేస్తున్నాయే తప్ప యువత కు ఉద్యో గాలు కల్పించాలని ఆలోచన చేయడంలేదని, త్వరలో ఆదిలాబాద్ సీసీఐ పునర్ ప్రారంభించే దిశగా సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉదృతం చేస్తామని జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లో సీసీ ఐపరిశ్రమను ప్రారంభించి యువత వలస ఉద్యోగాలను నియంత్రించేలా కృషి చే స్తామన్నారు. త్వరలో రిలే దీక్షలు, నిరసనలతో పాటు ముట్టడి కార్యక్రమాలను చే పడతామ న్నారు. మొదట నిరాహార దీక్ష చేపట్టి ప్రభు త్వానికి హెచ్చరిక జారీ చేస్తామన్నారు. సీసీఐ భూని ర్వాసితులకు అండగా నిల బడుతూ యువత ఉద్యోగాలు స్థానికంగా అందేలా కృ షి చేస్తామని, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభు త్వం టిఎస్పిఎస్ ద్వారా ప్రాంతీయ పార్టీగా సి సి ఐ పరిశ్రమను పునర్ ప్రారంభిం చే దిశగా ముందడుగు వే స్తుంటే రాజకీయ కక్ష సాధిం పులో కేంద్ర ప్రభుత్వం నిర్ల క్ష్యం చేసిందని అన్నారు.ఈ సమావేశం లో వివిధ సా మాజిక సంఘాల నుండీ ప్రతినిధులు దర్శనాల మల్లే ష్, విజ్జగిరి నారాయణ కో – కన్వీనర్, వెంకట నారాయ ణ, అరుణ్ కుమార్, బొల్లు ఈశ్వర్ దాస్, జగన్ సింగ్, మునిగేల నర్సింగ్, లోకారి పోశెట్టి, బొర్రన్న, బండి దత్తా త్రి, శివన్న మున్నూరు (కాపు సంఘం అధ్యక్షులు) ఆర్. రంగన్న డిటిఎఫ్ నాయకులు, నరసింహులు (రిటైర్డ్ కలెక్టర్ సిసి ) ఉమా కాంత్ (జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు)ఎర్రం నర్సింగ్ (యువజన సంఘాల అధ్యక్షులు) కస్తాల ఆరుణ్, యూనూస్ అక్బాని, సాజీ దోద్దీన్, లంక రాఘవులు, విట్టల్, పూసం సచిన్, మంజుల, స్వరూప, కరుణ, బుట్టి శివ, ప్రశాంత్, చందాల రాజన్న, దర్శనాల నగేష్, ద మ్మాపాల్ , అన్నమొల్ల కిర ణ్ తదితరులు వక్తలు తమ సూచనలు తెలిపారు.

## ఎల్‌నీనో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ల కలెక్టర్ల సమీక్షా సమావే శంలో స్పెషల్ ఆఫీసర్ ఇ లంబార్తి**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20, (ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో ఎల్‌నీనో ప్రభావం నేప థ్యంలో ఏర్పడే పరిస్థితులను సమర్ధవంతంగా ఎదు ర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను పక డ్బందీగా అమలు చేయా లని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఇలం బార్తి అధికారులను ఆదే శించారు.సోమవారం ఉ ట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఎల్‌నీనో ప్రభావ తీవ్రతను తగ్గించేం దుకు రూపొందించిన ప్రత్యా మ్నాయ కార్యా చరణ ప్రణా ళికపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతిని ధులు, వివిధ శాఖల జిల్లా అధికా రులతో సమీక్షా స మావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రణాళికా వి భాగం జిల్లా ప్రణాళికా అధి కారి, వ్యవసాయ శాఖ జిల్లా వ్యవసాయ అధికారి, ఉద్యానవన శాఖ జిల్లా ఉద్యా నవన అధికారి, నీటిపా రుదల శాఖ ఎస్ఈ, ఈఈలు, భూగర్భ జల శాఖ జిల్లా అధికారి, శక్తి విభాగం టీ జీ ఎన్ పీ డీ సీఎల్ ఎస్ఈ, డీఈలు, పురపాలక పరిపాల న అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ, సీఈ వో, పీఆర్ అధికారులు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి, కేవీకే/ఐసీఏఆర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, మిషన్ భగీరథ అధికారులు, అటవీ శాఖ డీఎఫ్‌వో, సివిల్ సప్లైస్ డీసీఎస్‌వో, వైద్యారోగ్య శాఖ డీఎంహెచ్ వో, డీసీ హెచ్ఎస్, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీ సర్ ఇలంబర్తి మాట్లాడుతూ ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదు ర్కోవడంలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాలని అన్నా రు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవ సాయ రంగంపై ప్రభావం వంటి అంశాలను ముందు గానే అంచనా వేసి శాఖల మధ్య సమన్వయంతో పని చేస్తే తీవ్రత ను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి శాఖ తమ కార్యాచరణ ప్రణాళికను క్షేత్రస్థాయిలో సమ ర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు.మంచిర్యాల శాసనసభ్యు లు ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజల సంక్షేమ దృక్పథంతో చూ డాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు మీ డియా ద్వారా విస్తృత ప్ర చారం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు వరకు వర్షాలు వచ్చే అవకాశము న్నందున రైతులు పెసర్లు, కందులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించేందు కు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అటవీ హక్కుల చట్టం కింద హక్కులు పొందిన రైతులకు రైతు భరోసా నిధులు అందేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బజ్జు పటేల్ మాట్లాడుతూ స మావేశంలో అన్ని శాఖల అధికారులు విలువైన సూచనలు చేశారని అన్నారు. అయితే పోడు భూముల సమస్యలపై చర్చ జరుగు తున్న సమయంలో అటవీ శాఖ అధికారులు గైర్హాజరు కావడం విచారకరమన్నారు. ఈ సమస్యను ప్రాధా న్యతగా తీసుకొని సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పోడు భూముల సమస్యల పరిష్కారానికి ప్ర భుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు యూరియా ఎరువుల పంపిణీ కో సం తప్పనిసరిగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రై తులకు అవసరమైన వ్యవ సాయ సేవలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నీనో ప్రభా వాన్ని సమర్ధవంతంగా ఎదు ర్కోవచ్చని పేర్కొన్నారు. ప్ర జల్లో అవగాహన పెంచేందు కు మీడియా ముఖ్యమైన పాత్ర పోషించాలని, ప్రభు త్వ సూచనలు ప్రతి గ్రామా నికి చేరేలా ప్రచారం నిర్వ హించాలని కోరారు.నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంర క్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామ ర్థ్యాన్ని పెంచే చర్యలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావే శంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ శాఖల తరఫున ఎల్‌నీనో ప్రభావాన్ని తగ్గించేందుకు చేపట్ట నున్న కార్యాచరణ ప్రణాళి కలను వివరించారు. వ్యవ సా యం, ఉద్యానవనం, తాగునీరు, విద్యుత్, పశుసంవ ర్ధక, ఆరోగ్యం, అటవీ, పంచాయతీరాజ్, పురపా లక, మహిళా శిశు సంక్షేమ తదితర రంగాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమ గ్రంగా చర్చించా రు.ఎల్‌నీనో ప్రభావం వల్ల తలెత్తే సవా ళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వ యంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలను నిరరరం అందించాలని సమా వేశంలో స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మందమ కరందు, ఉమ్మడి జిల్లాల అడిషనల్ కలెక్టర్‌లు, అధికారులు పాల్గన్నారు.

# గులాబీ కంచుకోటపై కాంగ్రెస్ కన్ను

**కరీంనగర్ :** తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు సరికొత్త, అత్యంత వ్యూహాత్మకమైన అంతర్గత పోరాటం సాగుతోంది. నిన్నటివరకు తిరుగులేని రాజకీయ శక్తులుగా, అజేయమైన కోటలుగా వెలిగిన బీఆర్ఎస్ టాప్ లీడర్ల సొంత నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కన్నేసింది. గులాబీ దళపతి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డా సిరిసిల్ల, ట్రబుల్ షూటర్ హరీష్ రావు కంచుకోట సిద్దిపేట నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. ప్రధాన నేతలను నేరుగా ఢీకొట్టడం కంటే, వారి రాజకీయ పునాదులను కదిలించేలా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వేస్తున్న అడుగులు క్షేత్రస్థాయి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు వ్యూహాత్మకంగా ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా గజ్వేల్ ? సిద్దిపేట సరిహద్దు ప్రాంతాల్లో ఈ సైలెంట్ ఆపరేషన్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. టాప్ లీడర్లు హైదరాబాద్‌లోనే ఉంటూ అసెంబ్లీ లేదా మీడియా వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం హస్తం శ్రేణులు గ్రామాల్లోని కరడుగట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. గజ్వేల్ లాంటి ప్రాంతాల్లో క్యాంప్ ఆఫీసుల చుట్టూ జరుగుతున్న రాజకీయ ఘర్షణలు, నిరసనలు కేవలం పైకి కనిపిస్తున్న ఊహాగానాలు కావు, లోపల మాత్రం కాంగ్రెస్ తన పనిని నిశ్శబ్దంగా పూర్తి చేస్తోంది. పదేళ్ల కాలంలో గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచులు, నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రజాప్రతినిధుల బలహీనతలను కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకుంటోంది. వారికి అధికార పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తూనే, మూడు రకాల ఆకర్షణీయమైన వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో రాబోయే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని లేదంటే స్థానిక నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తోంది. దారికి రాకపోతే అధికార బలంతో స్థానిక పనులకు బ్రేకులు వేయడం లేదా సహకరించడం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. బీఆర్ఎస్ అధిష్టానానికి, స్థానిక లీడర్లకు మధ్య గ్యాప్ పెంచేందుకు ప్రయత్నిస్తోంది. మీరు ప్రతిపక్ష పార్టీలో ఉంటే మీకు లాభం ఉండదని, అధికార పార్టీలోకి వస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమనే ప్రచారాన్ని క్యాడర్‌లోకి బలంగా తీసుకెళ్తున్నారు. దీనివల్ల నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఇంకా బలంగానే కనిపిస్తున్నా, లోపలి గ్రామాల్లో మాత్రం గులాబీ కోటల పునాదులు నెమ్మదిగా బలహీనపడుతున్నాయి. అయితే, ఈ ఆపరేషన్ కాంగ్రెస్‌కు అంత సులభంగా ఏకపక్షంగా సాగడం లేదు. సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో హరీష్ రావు లాంటి సీనియర్ నేతలు రంగంలోకి దిగి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు. అలకపాన్పు ఎక్కిన కార్యకర్తలను బుజ్జగించేందుకు, పార్టీ మారిన వారిని తిరిగి సొంత గూటికి చేర్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల వైఫల్యాలను, స్థానిక సంస్థల ఎన్నికల జాప్యాన్ని ఎండగడుతూ రివర్స్ అటాక్ చేస్తున్నారు. అయినప్పటికీ, అధికార పార్టీ విసిరిన వ్యూహాత్మక వలయం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కొంత అయోమయం స్పష్టంగా కనిపిస్తోంది. కంచుకోటలుగా భావించే ఈ మూడు నియోజకవర్గాల్లో క్యాడర్ గనుక చెల్లాచెదురైతే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. గులాబీ నేతలకు హస్తం పార్టీ వేస్తున్న ఈ గాలం కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం లేదా కేవలం స్థానిక లీడర్లను మార్చడం కోసం మాత్రమే కాదు. దీని వెనుక పెద్ద స్కెచ్ ఉంది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను రాష్ట్రస్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టకుండా, వారి వారి సొంత నియోజకవర్గాల రక్షణలోనే నిరంతరం బిజీగా ఉంచాలనేది కాంగ్రెస్ మార్క్ హైలెవల్ పొలిటికల్ స్ట్రాటజీ. తద్వారా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై వారి దూకుడును తగ్గించవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మైండ్ గేమ్‌లో అధికార కాంగ్రెస్ ఎంతవరకు సఫలమవుతుంది, గులాబీ త్రయం తమ కంచుకోటలను ఎలా కాపాడుకుంటుంది అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**సాంకేతిక ఆధారాలతో కేసు చేదించిన మావల పోలీసులు**

**36 గ్రాముల బంగారం, 25. 5 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం**

**ప్రజలు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**గతంలో ఎ1 పై 8 , ఎ2 పై మూడు దొంగతనం కేసులు**






**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20, (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో న మోదైన వరుస దొంగతనాల కేసులను మావల పోలీసు లు సమర్థవంతంగా ఛేదించి, నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకు న్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు.

**వివరాలలో**

ఈ ఏడాది జనవరి 18న ఆదర్శ్‌నగర్‌కు చెందిన నైతం గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి న సమయంలో గుర్తుతెలి యని వ్యక్తులు ఇంటి తాళా లు పగులగొట్టి లోనికి ప్రవే శించి బంగారు, వెండి ఆభర ణాలు, నగదును అపహ రించారు. కేసు నమోదు చేసిన వెంటనే ప్రతిష్టాత్మ కంగా తీసుకున్న మావల పోలీసులు సంఘటన స్థలా న్ని పరిశీలించి, సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ కెమెరాలు, క్షేత్రస్థాయిలో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేప ట్టారు. దర్యాప్తులో మహారాష్ట్రకు చెందిన అలవాటుగా ఇళ్లలో దొంగత నాలకు పాల్పడే ముఠాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**

షిండే సునీల్ ఏ రాకీ (ఎ1) (25), గిట్టికడమ్, బోర్‌గావ్, వర్ధా జిల్లా, మహారాష్ట్ర.కు మ్రేసుజల్ యురాజ్ (ఎ2) (19), బోర్‌గావ్ గ్రామం, సావంగి పీఎస్, వర్ధా జిల్లా, మ హారాష్ట్ర. మార్జివే శేఖర్ (ఎ 3) (43), రామ్‌నగర్, ఎస్ టిడి డిపోరోడ్, వర్ధా జిల్లా, మహారాష్ట్ర. గాయకవాడ్ లక్ష్మణ్ (ఎ4) (28), వెరోల్లా గ్రామం, భండారా జిల్లా, మహారాష్ట్ర. విచారణలో నిందితులు మావల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఆదర్శనగర్ కాలనీ, ట్రైలర్స్ కాల నీలలో, క్రైమ్ నెం.34/ 202 6, 35/2026, 41/2026 కే సులకు పాల్పడినట్లు తెలి పారు. వారి వద్ద నుంచి సు మారు 36 గ్రాముల బంగా రు ఆభరణాలు, 25.5 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. మిగిలిన చోరీ సొత్తు స్వాధీనం చే సుకోవడంతో పాటు తెలం గాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో నమోదైన ఇతర ఇంటి చోరీ కేసుల్లో వీరి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగు తోందన్నారు. గతంలో ప్రధాన నింది తుడు ఎ1 పై మహారాష్ట్ర వార్దా యువతమాత జిల్లా లలో 8 కేసులు నమోదు అ యినట్లు అదే విధంగా మరో నిందితుడు ఎ2 పై మూడు కేసులు నమోదు అయినట్లు వివరించారు. ఈ సందర్భం గా జిల్లా ఎస్పీ ప్రజలకు ప లు సూచనలు చేశారు. ఇంటికి తాళం వేసి బయ టకు వెళ్లేటప్పుడు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంట్లో అధిక మొత్తంలో నగదు, విలువైన ఆభరణాలు భద్రత లేకుండా ఉంచవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనిం చిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీ వన్ రెడ్డి, మావల సీఐ బి. డి. ప్రేమ్ కుమార్, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది షబ్బీర్, సట్ల శ్రీను, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావంపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమీక్ష






**రైతులను ఆదుకుని అండగా ఉంటాం**

**మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

**మంచిర్యాల, 20, జులై (ప్రజాజ్యోతి):** ఖానాపూర్ నియోజకవర్గం లోని ఉట్నూర్ ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఎల్-నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందు కు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు హాజరై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ఎల్-నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను సమర్థవం తంగా ఎదుర్కొని రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరత, పంటలపై పడే ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. నీటి వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పించడం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై చైతన్యం తీసుకురావడం అధికారుల బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీల్లో నెలకొన్న తాగునీటి, పారిశుద్ధ్య తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. రైతుల సంక్షేమం విషయంలో పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ కె. ఇళంబరితి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఖానాపూర్ ఎమ్మె ల్యే వెడ్మ బొజ్జు పటేల్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమష్టిగా నిలబడి ఎల్- నినోను ఎదుర్కొందాం









**రైతులు, ప్రజల రక్షణే ప్రభు త్వ ప్రధాన లక్ష్యం**

**అన్ని శాఖలు మిషన్ మోడ్ లో పనిచేయాలి**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి ఇల్లంబర్తి**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 20, (ప్రజా జ్యోతి)** ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కు వ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి ఇల్లంబర్తి అధికారులను ఆదేశించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు, కంటింజెన్సీ ప్లాన్‌లను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవచ్చని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఎల్-నినో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక అధికారికి జిల్లా కలెక్టర్లు, అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, ఎల్-నినో ప్రభావాన్ని వ్యవసాయ రంగానికే పరిమితం చేయకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్, పశు సంవర్ధక, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవనం, భూగర్భ జలాలు, ఇరిగేషన్ తదితర అన్ని రంగాలపై ప్రభావం చూపే పరిస్థితిగా భావించి శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ గ్రామాన రైతులకు వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, కందులు, పెసర్లు, నువ్వులు, వేరుశనగ, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లాల వారీగా జలాశయాల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితులు, విద్యుత్ సరఫరా, పంటల స్థితిగతులను సమీక్షించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, తాగునీరు, విద్యుత్, వైద్యం, భూగర్భ జలాలు, ఇరిగేషన్, మహిళా శిశు సంక్షేమం, కృషి విజ్ఞాన కేంద్రం తదితర శాఖలు తమ యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం 40--45 శాతం వరకు వర్షపాత లోటు నమోదయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు, ప్రజలను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని శాఖల సిబ్బంది సమష్టిగా పనిచేస్తే ఎల్-నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని ప్రత్యేక అధికారి అన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫామ్ పాండ్ల ఏర్పాటుతో భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సిల్టేషన్ తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు యూరియా బుకింగ్ యాప్‌లో నమోదు చేసుకుని అవసరమైన ఎరువులు పొందాలని సూచించారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, భూగర్భ జలాల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమన్నారు. రైతులు 8ఐ8ఐ2 మీటర్ల ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భద్రపరచాలని, జిల్లాలో పెద్దఎత్తున నీటి సంరక్షణ చర్యలు చేపడితే భవిష్యత్ తాగునీటి, సాగునీటి అవసరాలను తీర్చవచ్చని తెలిపారు. కంది వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ప్రోత్సహించాలని సూచించారు. కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను చేరవేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని, అత్యవసర పరిస్థితులకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని, పత్తి సాగు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులు కందులు, పెసర్లు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నీటి నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కడెం ప్రాజెక్టు నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పైపులైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి నీటి వృథాను నివారించాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఎల్-నినో బుక్‌లెట్, తెలంగాణ జలసిరి పోస్టర్లను ప్రత్యేక అధికారి, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్. ఎస్ చిత్రు, బి. వెంకటేశ్వర్లు, పి. చంద్రయ్య, యువరాజ్ మర్మట్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, క్యాతన పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి, చెన్నూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పి.పద్మ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అధిష్టానం ఎంట్రీతో

## ఈటెల, బండి మధ్య గ్యాప్ తగ్గినట్టేనా

**హైదరాబాద్ :** తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు అధిష్టానం ప్రయత్నాలు షురూ చేసింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఢిల్లీ పెద్దలు, ఇక్కడి కీలక నేతల మధ్య ఉన్న కోల్డ్ వార్‌ను ముగించడానికి నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. రాష్ట్ర బీజేపీలో అత్యంత కీలక నేతలుగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైకమాండ్ గట్టి ప్రయత్నాలే చేస్తోందిఈ వివాదాన్ని వీలైనంత త్వరగా సమసిపోయేలా చూడాలనే పట్టుదలతో అధిష్టానం ఉంది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లిన అభయ్ పాటిల్, రాత్రి పొద్దుపోయే వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత పరిణామాలు, విభేదాలకు గల కారణాలపై ఆయనతో ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్‌తో కూడా అభయ్ పాటిల్ భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో ఒక కీలకమైన భేటీ జరగనుంది. ఈ మీటింగ్‌కు ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ హాజరుకానుండటం విశేషం. అధిష్టానం దూతలుగా వచ్చిన సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ సమక్షంలో ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించడానికి లక్ష్మణ్ నివాసం వేదిక కాబోతోంది. కొంతకాలంగా ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య సఖ్యత లోపించిన విషయం బహిరంగ రహస్యమే. ఒకరిపై మరొకరు పరోక్షంగా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న గ్యాప్ చూసి వారి అనుచరులు, అభిమానులు మరింత రెచ్చిపోయారు. పలు సందర్భాల్లో పరస్పర వ్యతిరేక పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఈ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఈ ప్రభావం పార్టీ బలోపేతంపై పడుతుండటంతో ఢిల్లీ పెద్దలు అలర్ట్ అయ్యారు. ఇటీవల తెలంగాణలో పర్యటించిన జాతీయ నేతలు నితిన్ నబీన్, జేపీ నడ్డా సైతం రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని కరాఖండిగా చెప్పారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో, ఇప్పుడు నేరుగా హైకమాండ్ రాయబారాన్ని పంపింది. తెలంగాణలో అధికారమే పరమావధిగా భావిస్తున్న బీజేపీకి ఈ ఇద్దరు నేతలూ అత్యంత అవసరం. బండి సంజయ్ మాస్ లీడర్‌షిప్, కేడర్‌లో ఉన్న ఫాలోయింగ్ పార్టీకి ఎంత ప్లస్సో.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం, వ్యూహాలు అంతే ముఖ్యం. వీరిలో ఏ ఒక్కరిని వదులుకోవడానికి లేదా దూరం పెట్టడానికి అధిష్టానం సిద్ధంగా లేదు. ఇద్దరి బలాలు కలిస్తేనే తెలంగాణలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ఢిల్లీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు. అధిష్టానం నేరుగా రంగంలోకి దిగడం, ఇవాళ ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు కీలక నేతలు ముఖాముఖి కూర్చోనుండటంతో ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ చర్చల తర్వాతైనా ఇద్దరు నేతలు తమ పంతాలను వీడి, పార్టీ కోసం కలిసి నడుస్తారని సాధారణ కార్యకర్తలు, క్యాడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఢిల్లీ పెద్దల బుజ్జగింపులు ఎంతవరకు పారుతాయో, టీ బీజేపీలో ఈ అంతర్గత సంక్షోభానికి తెరపడుతుందో లేదో చూడాలి.

## చిలుకూరులో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య పంట పొలాల పరిశీలన..

**రైతులు, వ్యవసాయ కూలీలతో మాజీ ఎమ్మెల్యే భేటీ**

**సూర్యాపేట :** చిలుకూరు మండల కేంద్రంలోని పంట పొలాలను పరిశీలించిన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.